క్లుప్తంగా

సాయాన్ని పాతబాకీగా జమచేయొద్దు

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బీసీ, మైనార్టీ బంధు పథకాల కింద ఇచ్చే సహాయాన్ని బ్యాంకర్లు పాత అప్పుకింద జమచేసుకోవద్దని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. పాల్వంచ మండలం దంతలబోరు గ్రామానికి చెందిన చెరుకు శ్రీనివాసరావుకు ఇటీవల బీసీ బంధు పథకం కింద రూ.1 లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నాడు. ఆ చెక్కును ఏపీజీవీబీ బ్యాంక్ ఖాతాలో వేయగా బ్యాంక్ మేనేజర్ పాతబాకీ కింద జమచేసుకున్నారు. ఈ విషయాన్ని బాధితుడు కొత్వాల దృష్టికి తీసుకవెళ్లగా శుక్రవారం బ్యాంక్ మేనేజర్ దిలీప్ శుక్లా, ఫీల్డ్ ఆఫీసర్ ఈశ్వర్‌లను కొత్వాల నిలదీశారు. దీనికి స్పందించిన మేనేజర్ పాతబాకీ కింద జమచేసుకున్న లక్షరూపాయలను తిరిగి లబ్ధిదారుడికి అందజేశారు.

మున్నూరుకాపు ప్లీనరీని జయప్రదం చేయండి

జూలూరుపాడు: 27న హైదరాబాద్ నక్లెస్ రోడ్‌లోని జలవిహార్ సందులో జరిగే మున్నూరుకాపు రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాపట్ల మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఈ ప్లీనరీలో అపెక్స్ కౌన్సిల్ చైర్మన్, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తం పటేల్, మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ముంపు బాధితులను ఆదుకోవాలి

టేకులపల్లి: చర్ల మండలంలో గోదావరి ముంపు బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని ప్రజాపంథా టేకులపల్లి మండల కార్యదర్శి ధర్మపురి వీర బ్రహ్మచారి, ఐఎఫ్‌టీయూ నాయకుడు జరుపుల సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోదావరి ముంపు బాధితులకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసి వారిని ఆదుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

జూలూరుపాడు: మండలంలోని జడలచింత గ్రామంలో శుక్రవారం కళాజాత బృందం సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సీజనల్ వ్యాధులు, ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కళాజాత బృందం నాయకుడు పాగి వెంకన్న, సభ్యులు ఎంగల కుమారి, ముత్యం, నకిరికంటి వెంకటేశ్వర్లు, గోవింద్, గురవయ్య, పాల్గొన్నారు.

వైరా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

జూలూరుపాడు: బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థిగా బానోత్ మదన్‌లాల్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించిన తరువాత తొలిసారిగా వైరాకు శుక్రవారం వచ్చిన సందర్భంగా ఆయనకు స్వాగతం పలికేందుకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. మండలకేంద్రంలో ర్యాలీని జెడ్పీటీసీ భూక్యా కళావతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్‌లు జెండా ఊపి ప్రారంభించారు. వెళ్లిన వారిలో సత్యనారాయణ, నరసింహారావు, చావా వెంకటరామారావు, నాగేశ్వరరావు, బానోత్ హరిలాల్, కొదుమూరి మల్లిఖార్జున్‌రావు, తాళ్లూరి రామారావు, చందర్, నిమ్మటూరి కనకయ్య, శంకర్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన క్రెడిట్ సొసైటీ విజేతలు




ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సొసైటీ బాధ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణిలో అంతర్భాగమైన కార్పొరేట్ ఎస్అండ్‌పీసీ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ప్యానల్‌లో ఏడు స్థానాలకు గాను 14 మంది పోటీ చేశారు. ఈ మేరకు నక్క వెంకటరమణ, బందెల విజేందర్, మోరె రమేష్‌కుమార్, పాపట్ల నాగిరెడ్డి, మీసాల శ్రీనివాస్, లక్ష్మీనరసమ్మ, రేష్మ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావుతో కలిసి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సొసైటీని నిజాయితీగా నడపాలని సూచించారు. కాగా, ఎన్నికల్లో సహకరించిన టీబీజీకేఎస్ నాయకులు ఎం.సోమిరెడ్డి, ఎండీ.రజాక్, కూసన వీరభద్రం, జే.బీ.మోహన్, కొండ స్వామి తదితరులకు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు గద్దర్ సంస్మరణ సభ

టేకులపల్లి: ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో ఆదివారం టేకులపల్లిలో నిర్వహిస్తున్నట్లు టీపీఎఫ్ జిల్లా నాయకుడు ఎట్టి ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరలక్ష్మీ నమోస్తుతే..



కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం భజన మందిరంలో అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ



పాల్వంచ: ముత్యాలమ్మ తల్లి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

మహిళలకు అత్యంత ఇష్టమైన పండుగ వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం ఇళ్లలోనూ, ఆలయాల్లోనూ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్లలో కుటుంబసభ్యులతో కలిసి, ఆలయాల్లో భక్తులందరితో కలిసి మహిళలు ప్రత్యేక పూజలను, సామూహిక కుంకుమార్చన పూజలను చేశారు. వరలక్ష్మీ అమ్మవారిని అందంగా అలంకరించి అమ్మవారి నైవేద్యాలను సమర్పించారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయాల్లో సైతం అర్చకులు అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



సూపర్‌బజార్(కొత్తగూడెం): శిబిరంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న రెండో ఏఎన్ఎంలు



జూలూరుపాడు: పూజలందుకున్న పాపకొల్లులోని శ్రీ కోటమైసమ్మ తల్లి అమ్మవారు

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ మడవి సరస్వతి అధ్యక్షతన ప్రభుత్వశాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించగా ప్రజాప్రతినిధులు సమస్యలను విన్నవించారు. దీంతో పలుశాఖల అధికారులతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాగ్వాదానికి దిగారు. అధికారులు పంచాయతీలో నిర్వహించే అభివృద్ధి పనుల సమాచారం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలపకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సమావేశానికి గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుతోపాటు పలువురు సర్పంచ్ డిమాండ్ చేశారు. మండలంలో ఎస్‌డీఎఫ్ కింద రూ.3 కోట్ల వ్యయంతో 167 పనులు జరుగుతున్నాయని మండల ఏఈ అనిల్ వివరించగా లక్ష్మీదేవిపల్లి, సోములగూడెం పంచాయతీలో నేటికి ఒక్క సీసీ రోడ్డు మంజూరుచేయకుండా అధికారులు వివక్షతచూపుతున్నారని సర్పంచ్ భిక్షం, ఎంపీటీసీ మోహన్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. అవసరమైన రైతులు మహిళ గ్రూపులను సంప్రదించి అద్దెలకు పవర్‌స్ప్రేలు, ఆయిల్ ఇంజన్లు తీసుకుని వినియోగించుకోవాలని ఏపీఎం రాంబాబు కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ బి.అప్పారావు, డీటీ వినయ్‌శీలా శ్రీరాం, ఎంపీఓ నారాయణ, ఆర్‌ఐ.హచ్యా, ఏపీఓ రంగా, ఎంపీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగనులు తీసి సంస్థ, కార్మికులను కాపాడాలి




వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కొత్త భూగర్భ గనుల ఏర్పాటుపై దృష్టి సారించి సంస్థతోపాటు కార్మికులను కాపాడాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలో డైరెక్టర్(పా) ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు భూగర్భగనులు అత్యధికంగా ఉండేవని, ఆతర్వాత ఓపెన్‌కాస్ట్ గనుల సంఖ్య పెంచుతుండడంతో పర్యావరణం దెబ్బతినడమే కాక కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. ఇకనైనా భూగర్భ గనుల సంఖ్య పెంచడమే కాక వేతన ఒప్పందపు ఏరియర్స్, లాభాల్లో వాటా చెల్లించాలని కోరారు.

అపరిమిత వైద్యసేవలు అందించాలి..

సింగరేణిలో రిటైర్డ్ అయిన వారికి కాంట్రిబ్యుటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీమ్ ఫర్ నాన్ ఎగ్జిక్యూటివ్(సీపీఆర్ఎంఎస్ – ఎన్ఈ) ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు అపరిమిత వైద్యసేవలు అందించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కోలిండియా మాదిరి సింగరేణిలో కూడా వైద్యం అందించాలని విన్నవించారు.

29న చలో హైదరాబాద్



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ ఈనెల 29న ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ కోరారు. ఇఫ్టూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తిచూపుతూ తక్షణం పరిష్కరించడంతోపాటు కార్మికుల హక్కులను కాపాడాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహిస్తామని వివరించారు. ఈ సమావేశంలో నాయకులు తోడేటి నాగేశ్వరరావు, వీరన్న, వెంకన్న, మోహన్‌రావు, నరాటి వెంకటేశ్వర్లు, జటంగి వెంకన్న, తొగర సామేలు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో గ్రామాలు అభివృద్ధి చేయాలి



అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న స్థానికులు

పాల్వంచ: కేటీపీఎస్ సీఎస్ఆర్ నిధులతో దత్తత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. అల్లూరి సెంటర్ నుండి కేటీపీఎస్ 5, 6వ దశల వరకు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, సీసీ రోడ్డు నిర్మించాలనే డిమాండ్‌తో వారు శుక్రవారం అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, రుసుం లేకుండా బూడిద టెండర్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సై రాము చేరుకుని ధర్నా విరమింపజేయగా, అనంతరం జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్యకు వినతిపత్రం అందజేశారు. దాసరి రమేశ్, అంగోతు నగేశ్, జీవన్ రెడ్డి, కూరకుల వెంకన్న, గుగులోతు భద్రు, నరేశ్, జక్కుల లింగేశ్వర్, శ్రీకాంత్, కార్తీక్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సుజాతనగర్: హైదరాబాద్ కోకాపేట్‌లో ఆదివారం చేపట్టనున్న పెరిక కుల భవన భూమి పూజకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం నాయకులగూడెం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో రాష్ట్ర పెరిక సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ సుంకరి ఆనంద్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బందు శ్రీధర్ బాబు, జిల్లా అధ్యక్షుడు గజవెల్లి సత్యనారాయణ, జిల్లా గౌరవ సలహాదారులు సోమిశెట్టి రాధాశేఖర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ అధ్యక్షుడు మండే వీర హనుమంతరావు, ఎల్ల కొండయ్య, బాలు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, చల్ది రవి, నరసింహారావు, కొమారి రవీందర్, బాలు రామయ్య, హనుమంతరావు, కృష్ణ, వెంకటేశ్వర్లు, నాగచందర్, వెంకటరాములు, నాగేశ్వరరావు, అనంతరాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా లక్కినేని దరఖాస్తు



దరఖాస్తు, డీడీ అందజేస్తున్న సురేందర్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకులు లక్కినేని సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తుఫారం, డీడీని గాంధీభవన్‌లో సమర్పించానన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కొత్తగూడెంఅర్బన్: మూడేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మైనార్టీ విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యండి.యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుతం కాలయాపన చేస్తూ పేద మైనార్టీ విద్యార్థు జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని పేర్కొన్నారు. అప్పులు చేసి కాలేజీ యజమాన్యాలకు నగదును చెల్లించి సర్టిఫికెట్లు పొందుతున్నారని తెలిపారు.

జాతీయస్థాయి అవార్డుపై సంబురాలు

కొత్తగూడెంటౌన్: సినీనటుడు అల్లు అర్జున్‌కు జాతీయస్థాయిలో ఉత్తమనటుడిగా అవార్డు రావడంపై శుక్రవారం అభిమానులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు.

పింఛన్ పెంపు ఘనత కేసీఆర్‌దే..



దివ్యాంగులకు పింఛన్ పెంపు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: వందల్లో ఉన్న పింఛన్‌ను వేలల్లోకి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కింతుదని, దివ్యాంగులకు పింఛన్ పెంచి సీఎం కేసీఆర్ దేవుడిలా మారారని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. శుక్రవారం మార్కెట్ యార్డులో దివ్యాంగుల పింఛన్ పెంపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రంలో ప్రతీ ఇంటికి అందేలా చేశారన్నారు. లబ్ధిదారులు పింఛన్ పొంది సీఎం కేసీఆర్ దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయశాఖ చైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ... కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక పథకాల్లో ఆసరా పింఛన్ వల్ల వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ధైర్యమిచ్చిందన్నారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జెడ్పీటీసీ ఉమ, ఎంపీపీలు నాగరత్నమ్మ, కమిషనర్ కుమారస్వామి, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రమోద్, తహసీల్దార్‌లు, ఎంపీడీఓ, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ ...

ప్రజా సేవ కోసమే హరిప్రియ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే హరిప్రియ స్పష్టం చేశారు. ఫౌండేషన్‌లో సహాయ లేబర్ ఆఫీసర్ శాస్త్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. న్యాక్ సహకారంతో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. ఏడీ వెంకటరాజు, నాగమణి, కౌన్సిలర్ అనిత, కడకంచి పద్మ, జేకే శ్రీనివాస్, జెడ్పీటీసీ ఉమ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి



సూచనలు చేస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

చుంచుపల్లి: పరిసరాల పరిశుభ్రత తప్పకుండా పాటించాలని జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత అన్నారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మండలంలోని నందాతండా, చుంచుపల్లి తండా, విద్యానగర్ కాలనీ, 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, ధన్బాద్ గ్రామపంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు, మొక్కలు నాటే విధానం, పిచ్చి మొక్కల తొలగింపు వంటివి పరిశీలించారు. శనివారం జరిగే కోటి వృక్షార్చన కార్యక్రమంలో గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు బొంతు బాబురావు, జర్పుల రవి, సత్యనారాయణ, ఉపేందర్, భాష, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి



ఇల్లెందు: మాట్లాడుతున్న సమీర్ కునవార్

ఇల్లెందు: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు లక్ష్యంగా పని చేయాలని మహారాష్ట్ర విధాన సభ డిప్యూటీ స్పీకర్ సమీర్ కునవార్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులో పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీని బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఇల్లెందులో గత రెండు దఫాలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే పార్టీ మారి ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. అవినీతి, కుటుంబ పాలనకు ప్రత్యామ్నయంగా రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ నెల 27న ఖమ్మంలో అమిత్‌షా సభతో ఎన్నికల శంఖారావం పూరించబోతున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మాచినేని ధర్మారావు, నియోజకవర్గ ప్రభారీ వి. రాజవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, నియోజకవర్గ కన్వీనర్ బలగానీ గోపీకృష్ణ, నాయకులు నాళ్ల సోమసుందర్, రాంచందర్ నాయక్, కె. సంజీవరెడ్డి, మావునూరి మాదవ్, హతీరామ్ నాయక్ పాల్గొన్నారు.



జూలూరుపాడు: మాట్లాడుతున్న జయప్రకాష్

జూలూరుపాడు: బీజేపీని దేశవ్యాప్తంగా ప్రజలు ఆదరిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని గోవా రాష్ట్ర సాలిగావ్ ఎమ్మెల్యే కేదార్ జయప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయకుండా అవినీతికి పాల్పడుతుందని విమర్శించారు. అనంతరం కాకర్ల శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, ఖమ్మం జిల్లా మహిళా అధ్యక్షురాలు దొడ్డ అరుణ, సున్నా రమేష్, మాదినేని సతీష్, భూక్యా శ్రీను, సిరిపురపు ప్రసాద్, లక్ష్మణాచారి, సోడెం అరుణ, దుద్దుకూరు కారీక్, మోత్కూరు నాగేశ్వరరావు, భూక్యా రవి, పాల్గొన్నారు.

శ్రీ విద్యాపీఠాన్ని సందర్శించిన గోవా ఎమ్మెల్యే

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీ విద్యా పీఠంలోని త్రిపూర సుందరీ మాతా అమ్మవారిని శుక్రవారం గోవా ఎమ్మెల్యే సంకల్ప్ ఆయోంకార్ సందర్శించారు. కొత్తగూడెం శ్రీ విద్యా పీఠం గురువు కొచ్చర్ల సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వారాహి పూజలను నిర్వహించారు.

అంధకారంలోనే..

- సెంట్రల్ లైటింగ్ వెలుగులు ఎన్నడు?
- నాలుగు నెలల క్రితమే పనులు పూర్తి



వెలగని హైమాస్ట్ లైట్లు



మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన స్తంభాలు

సుజాతనగర్: మండల కేంద్రం సుందరీకరణలో భాగంగా రూ.38 లక్షలతో సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వెలుగులకు మోక్షం కలగడం లేదు. సుమారు 4 నెలల క్రితమే ఈ పనులు పూర్తి చేశారు. గత నెలరోజుల క్రితమే వాటిని ప్రారంభిస్తామని ప్రకటించినా..ఇప్పటిదాకా అందుకు నోచుకోలేదు. ఫలితంగా ప్రధాన రహదారిపై చిమ్మచీకట్లు తప్పడం లేదు.


అభివృద్ధిలో భాగంగా..

ప్రజాప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తుల మేరకు సీడీపీ రూ.38 లక్షలతో ఈ పనులు చేపట్టారు. 1.4 కిలోమీటర్ల మేర సుమారు 27 మీటర్లకు ఒక్కటి చొప్పున మొత్తం 27 స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లను కూడా అమర్చారు. పనులు పూర్తయి నాలుగు నెలలు గడిచినా లైట్లు వెలిగించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తిచేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు మినహా మిగిలిన పనులన్నీ పూర్తయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండంతో అంధకారం తప్పడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు ఎస్టిమేషన్ పంపినా నగదును పీఆర్ శాఖ చెల్లించలేదని సమాచారం. సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి వచ్చినా లైట్లు వెలగకపోవడంతో సుమారు కిలోమీటరుమేర అంధకారం నెలకొంటోంది. చీకటిలో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌ను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.


చీకట్లో కనబడక ప్రమాదాలు



సుమారు 3 నెలల క్రితమే డివైడర్‌లో సెంట్రల్ లైటింగ్ స్తంబాలను ఏర్పాటు చేసి లైట్లను కూడా అమర్చారు. ఇప్పటి వరకు లైట్లు వెలిగించకపోవడంతో మండల కేంద్రలో అంధకారం ఉంటోంది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– చారుగుండ్ల ప్రసాద్, సుజాతనగర్

పీఆర్ శాఖ నగదు చెల్లించాల్సి ఉంది



రెండు నెలల క్రితమే ఎస్టిమేషన్ కాపీని తాము పీఆర్ శాఖకు పంపడం జరిగింది. వారు నగదు చెల్లిస్తే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరీ అవుతుంది. అప్పుడే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి వీలవుతుంది.

– జి.కిషన్,ఎలక్ట్రికల్ ఏఈ